ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 9 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 21 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



# చివరి ఆయకట్టుకు సాగునీరు

**తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత**

**ఎత్తిపోతల పథకాలు, చెక్ డ్యాం నిర్మాణం, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**మధిర ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** చివరి ఆయకట్టుకు సాగునీరందేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి మధిర మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 6 కోట్ల 85 లక్షలతో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు, సిరిపురం గ్రామంలో ఐదు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి, 10 కోట్ల 31 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మధిర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ భవన నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మహాదేవపురం గ్రామంలో సుమారు 952 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 12 కోట్ల 14 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మహాదేవాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, రాయపట్నం గ్రామంలో ..మిగతా 2లో

## తెలంగాణ ప్రజలకు
# రక్షణ కవచం గులాబీ జెండా

**ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండేదీ బీఅర్ఎస్ పార్టీ**

**క్రైస్తవ సోదరులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు**

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జన్మధిన శుభాకాంక్షలు అత్తాపూర్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులనుద్దేశించి మాట్లాడిన**

**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్**

**బుద్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండా అని, ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనం శ్రీరాంరెడ్డి ఆదివారం తన అనుచరులతో కలసి మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీకరెడ్డిలతో కలసి తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



వనం శ్రీరామ్ రెడ్డికి పార్టీ కండువా వేస్తున్న కేటీఆర్. చిత్రంలో పి సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డిలు



మాట్లాడుతున్న కేటీఆర్



# కిటాక్యూషు సిటీలో రేవంత్ టీమ్

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణహిత కిటాక్యూషు నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారులతో కూడిన బృందం కిటాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టకేయుచితో సమావేశమైంది. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు. "తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు, 2 కంపెనీలతో డీల్" ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్సీ, నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హెూల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ప్రపంచంలోని క్లీన్ సిటీలలో ఒకటి ఒకప్పుడు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ కజుహిసా టెక్యూచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

## ఇక నుంచి
# స్లాట్‌తోనే రిజిస్ట్రేషన్

**రాష్ట్రంలో కొత్త విధానం**



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కొత్త స్లాట్ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని అధికారులు అంచనాకు వచ్చారు. గతంలో దస్తావేజులు తీసుకుని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, కావాల్సిన ఆధారాలన్నీ పరిశీలించుకుంటే రిజిస్ట్రేషన్ ఎప్పుడనేది తెలిసేది కాదు. ఫలనా రోజున రావాలని అధికారులు చెబితే చెట్ల కిందనో, కార్యాలయం ముందో గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చేది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానం ఇందుకు భిన్నం. ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకోవాలి. అది ఇచ్చిన ప్రకారం కంప్యూటర్ కేటాయించిన సమయానికి వెళితే లావాదేవీ పూర్తవుతోంది. అందుకే వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 122 సబ్ రిజిస్ట్రార్ ..మిగతా 2లో

## రాచరికం
# మళ్లీ రావాలి



**నేపాల్‌లో భారీ నిరసనలు**

**కాఠ్మాండూలో రోడ్లపైకి వందలమంది**

**హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని డిమాండ్**

2

# కర్ణాటక మాజీ డీజీపీ హత్య

**కుటుంబ సభ్యులపైనే అనుమానం వ్యక్తం చేస్తున్న పోలీసులు**

**బెంగళూరు ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** కర్ణాటక మాజీ పోలీసు చీఫ్ ఓం ప్రకాష్ తన ఇంట్లో హత్యకు గురయ్యారు. ఆయన శరీరంపై కత్తి గాయాలు, నేలపై రక్తాన్ని పోలీసులు గమనించారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు ఆయనను హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. భార్యను అదుపులోకి తీసుకున్నారు. 68 ఏళ్ల ఓం ప్రకాష్ బెంగళూరులోని మూడంతస్తుల బిల్డింగ్‌లో నివసిస్తున్నారు. ఆదివారం ఇంట్లో అనుమానాస్పదంగా ఆయన మరణించినట్లు భార్య పల్లవి పోలీసులకు సమాచారం ఇచ్చింది. కాగా, పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. ఓం ప్రకాష్ కత్తి గాయాలతో మరణించినట్లు గమనించారు. నేలపై రక్తం కారి ఉండటాన్ని గమనించారు. ఓం ప్రకాష్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య పల్లవిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆమెతోపాటు కూతురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు బీహార్‌లోని చంపారన్‌కు చెందిన ఓం ప్రకాష్ 1981 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి. 2015 మార్చిలో కర్ణాటక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా ఆయన నియమితు లయ్యారు. 2017లో ఆ హెూదాలో పదవీ విరమరణ చేశారు. దీనికి ముందు కర్ణాటక ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్, హెూంగార్డ్స్ చీఫ్‌గా వ్యవహరించారు.





## యెమెన్‌పై అమెరికా
# బాంబుల వర్షం

**50 లక్ష్యాలు ధ్వంసం**

**80 మంది మృతి**

2



సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

## ఎంపీ, ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

చెన్నూరు, ఏప్రిల్ 20. (ప్రభాత ఉదయం) : చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామంలో కాంగ్రెస్ సేవాదళ్ బృందం ఆధ్వర్యంలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు గ్రామస్తులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు 140 కోట్ల రూపాయల ప్రావిడెంట్ ఫండ్ విడుదల చేయించిన ఎంపీ వంశీకృష్ణకు రిటైర్డ్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, వారి తరఫున గళమెత్తిన ఏకైక నాయకుడు గడ్డం వంశీకృష్ణనే అంటూ హర్షం వ్యక్తం చేస్తూ, వారి కృషిని మరువలేమని రిటైర్డ్, కార్మికులు పేర్కొన్నారు.



## స్వీయ రక్షణ ప్రతీ ఒక్కరికీ అవసరమే

**కుంఫు మాస్టర్, మోయిన్ ఖాన్ చెన్నూరు**

చెన్నూర్, ఏప్రిల్ 20. (ప్రభాత ఉదయం): ప్రతీ ఒక్కరూ తమను తాము రక్షించుకోనే సామర్థ్యం కలిగి ఉండాలని కుంఫు మాస్టర్ మోయిన్ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రోజున పట్టణంలోని న్యూ లయోలా హైస్కూల్లో టైగర్ ఫిష్ కుంఫు ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని మాస్టర్ మోయిన్ ఖాన్ తెలిపారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన టీ. పూజిత, బి రమ్య, రంజిత్ లకు బ్లాక్ బెల్ట్ లు ప్రధానం చేశామని, సాధించారని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ సంస్థకు చెందిన ఎం హరికృష్ణ, అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ పి ప్రసాద్ వేణు, కుంఫు రమేష్ రాజా, సినీ స్టంట్ ఫైటర్ రవి, డ్రంకెన్ మాస్టర్ ఆర్ట్స్ మరియు టైగర్ ఫిష్ సంస్థ నుండి పి తిరుపతి, ఎండి తాజ్ ముజాహిద్ హాజరై విద్యార్థులను అభినందించినట్లు మోయిన్ ఖాన్ తెలిపారు.



## టిడిపి హయంలోనే బడుగు బలమైన వర్గాల అభ్యున్నతి

చార్మినార్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం) పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం టిడిపి ఎంత గానో కృషి చేసిందనీ టిడిపి నాయకులు అన్నారు. ఆదివారం సీనియర్ టిడిపి నాయకులు.సంఘ సేవకులు రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో దూద్ బౌలిలోని అనాథ ఆశ్రమలో టిడిపి జాతీయ అధ్యక్షులు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మ దినం సందర్భంగా అన్న దాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాలికలకు పంపిణీ చేశారు.ఈకార్యక్రమం లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి అదహాక్ కమిటి సభ్యులు నాగు నగేశ్,మొహమ్మద్ అన్వర్ హుస్సేన్, సంఘ సేవకులు సుంకరి హనుమంత రావు, సీనియర్ టిడిపి నాయకులు రవీందర్ గౌడ్, అహ్మద్ షరీఫ్,శ్యామ్ సుందర్, జోగేందర్ సింగ్.కె. శ్రీకాంత్, సుధాకర్ తో పాటు పలువురు పాల్గొన్నారు



## కిటాక్యూషు సిటీలో రేవంత్ టీమ్

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదు అవసరం అని అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాద కరమై పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ - కిటాక్యూషు నగరాల మధ్య విమాన ప్రయాణ ఏర్పాటు చేయాలనే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ ప్రస్తావించారు. జపాన్‌లో యువ శక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కలిగిస్తే, అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవన ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది, పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.

# తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండా

మొదటి పేజీ తరువాయి...


కేటీఆర్ మాట్లాడుతూ, అత్తాపూర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకుడు వనం శ్రీరాంరెడ్డి బీఆర్ఎస్ లో చేరినందుకు దన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గత శాసనసభ ఎన్నికలలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదన్నారు. అడ్డిమార్ గుడ్డి దెబ్బ అన్నట్లు గోషా మహల్ లో బీజేపీ అభ్యర్థి గెలిచారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి వచ్చిన వారి ఉత్సాహం చూస్తుంటే తొందరలోనే పట్లోళ్ల కార్తీక్రెడ్డి ఎమ్మెల్యే అవుతాడనిపిస్తుందన్నారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపిం చారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ లో ఉన్న నాయకులను నమ్మడం లేదని, అగ్రనేతలను తీసుకువచ్చి డిక్లరేషన్ లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు.

**మాజీ ముఖ్యమంత్రుల పని తీరు భేష్ :**

ముఖ్యమంత్రులుగా పనిచేసిన దివంగత డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసాడన్నారు. వారిని అభినందించాల్సిందేనన్నారు. ఆరోగ్య శ్రీ పథకం గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు.

**విర్రవీగితే. లాభం ఉండదు :**

దండయాత్రలు చేసిన రాజులు కూడా అనవాళ్లు లేకుండ చేస్తాం అని చెప్పరని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు పెద్దవి.. చేతలు చిన్నవి అన్నట్లు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇండ్లు, వ్యాపార సముదాయాలు ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో ఉంటే ముట్టుకోరని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చుతున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాకు భూములు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, అవి ఎక్కడ ఉన్నాయో వారే చూపిం చాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి డబ్బులు లేవని, మూసీ కి మాత్రం లక్ష కోట్లు ఖర్చు చేస్తారట అని ఎద్దేవా చేశారు. మింగ మెతుకు లేదు మీసాలకు సంపంగి నూనె పెట్టిం డట ఒకడు అన్నట్లు ఉంది కాంగ్రెస్ పరిస్థితి అన్నారు. ఫిబ్రవరి నెలలో 31వ తేదీ ఉండదనేది ఎంత నిజమో రేవంత్ రెడ్డి మాటలు కూడా అంతే అన్నారు. ఎన్నో పార్టీలు వచ్చాయి...పోయాయని, రెండే రెండు పార్టీలు తెలుగుదేశం, బీఆర్ఎస్ లు మాత్రమే చరిత్రలో నిలిచి పోయాయన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వనం శ్రీరాం రెడ్డి

**ఈ నెల 27 నాటికి బీ ఆర్ ఎస్ కు 25 ఏండ్లు:**

బీఆర్ఎస్ పార్టీ అవిర్భవించి ఏప్రిల్ 27కు 25 యేండ్లు అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని దుయ్యబట్టారు. మత పిచ్చి, కుల పిచ్చి లేపుడు తప్ప ఆ పార్టీ చేసింది మరొకటి లేదన్నారు. హిందువులు ప్రమాదంలో ఉన్నారని బీజేపీ నాయకుడు మాట్లాడుతుంటే ప్రధాని గా మోడీ విఫలమయ్యారా... అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మతం పేరుతో ఓట్లడగడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ ఆర్ టాక్స్ వసూలు చేస్తుందని మోడీ నే మాట్లాడుతుండని, ఎందుకు చర్య లు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు రేవంత్ రెడ్డి బావమరిదికి కట్టబెడితే కేంద్ర ప్రభుత్వం చర్యలే లేవన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపైన ఈడీ కేసులు నమోదు చేస్తే ఇంతవరకు రేవంత్ రెడ్డి మాట్లాడలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్ ను లేకుండ చేయాలని కంకణం కట్టుకున్నాయన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తి లో బీఅర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ఉందని, ఈ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ల కార్యకర్తలు టైంకు రావాలన్నారు. చేవెళ్ల, రాజేంద్రనగర్ లో ఉప ఎన్నికలు రాబోతున్నాయని, ఈ రెండు నియోజకవర్గాలలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు ఉషారు కావాలన్నారు. నియోజకవర్గాలలో జెండా దిమ్మెలకు గులాబీ రంగు వేసుకోవాలన్నారు. దిమ్మెలు లేకపోతే కొత్తవి కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, అత్తాపూర్ మాజీ కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య, మైలార్దేవుపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు : కేటీఆర్**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న క్రైస్తవ సోదరులకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియాజేశారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరు

మొదటి పేజీ తరువాయి...

1079 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన రాయపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.మధిర మునిసిపాలిటీ 3వ వార్డు, అంబారుపేటలో మధిర నుండి ములుగుమాడు వయా నిదానపురం వరకు ఉన్న రహదారిని 25 కోట్ల అంచనా వ్యయంతో రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేయుటకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఉపముఖ్యమంత్రి, శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ మధిర మండలం సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే దిశగా వైరా నదిపై 6 కోట్ల 85 లక్షలతో చెక్ డ్యాం నిర్మిస్తున్నామని, చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ వృద్ధికి దోహద పడతాయని,వేసవి, చలి కాలంలో భూగర్భ జలాల కొరత తగ్గిపోతుందని అన్నారు.చెక్ డాం పైన 3 చిన్న ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, చెక్ డ్యాం నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్ 1.5 కిలో మీటర్ల వరకు ఉంటుందని, చిన్న ఎత్తిపోతల పథకాలకు సంవత్సరం పాటు నీరు అందుబాటులో ఉంటుందని, నది గర్భం సమీపంలో గల గ్రామాలలో భూగర్భ జలాలు అధికంగా పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఖర్చు చేసినప్పటికీ ఆయకట్టు సృష్టించడంలో వైఫల్యం చెందిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ ఖర్చుతో కూడుకున్న పనులు చేపట్టి అధిక ఆయకట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. పేదల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం సమాంతరంగా చేపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలను సంపన్నులుగా చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ పనులు చేపట్టామని, ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు, మండలాలలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, రైస్ మిల్లులో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఖమ్మం సిఇ ఓ.వి. రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్, ఇర్రిగేషన్ కల్లూరు సర్కిల్ ఎస్ఇ జి.వాసంతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఇర్రిగేషన్ మధిర డివిజన్ ఇఇ సి.హెచ్. రామకృష్ణ, మధిర డిఇఇ వి.నాగ బ్రహ్మయ్య, సిరిపురం ఏఇఇ బి.శివ పాల్గొన్నారు

# ఇక నుంచి స్లాట్‌తోనే రిజిస్ట్రేషన్




మొదటి పేజీ తరువాయి...

కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని ఆ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు అమలవుతున్న 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించిన లావాదేవీలను, ఎదురవుతున్న అవాంతరాలను, టెక్నికల్ అంశాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల రిజిస్ట్రార్ల పరిధిలో షిఫ్ట్ విధానం అమలు చేసే ప్రణాళికలు ఉన్నాయి. ఈ మూడు జిల్లాల పరిధిలో రోజుకు సగటున 100 డాక్యుమెంట్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు కేటాయిస్తుండగా ఎక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు వచ్చే కార్యాలయాలకు అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులు భావిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్నాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది వరకు మరో షిఫ్ట్‌ను అమలు చేయడం ద్వారా పనిభారం తగ్గించడంతో పాటు ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు ప్రస్తుతం చంపాపేట, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకీకృత విధానం విజయవంతంగా నడుస్తోంది. వీటిల్లో ఎక్కడ రద్దీ తక్కువగా ఉంటే అక్కడికి స్లాట్ వేరే చోటకి బదలాయింపు ఆటోమేటిక్‌గా జరుగుతోంది. ఇదే విధానాన్ని ఫరూఖ్‌నగర్-షాద్‌నగర్, సంగారెడ్డి-పటాన్‌చెరు-అమీన్‌పూర్, కుత్బుల్లాపూర్-బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేయాలని ప్లాన్ వేశారు. భూభారతి తరహాలో ఈ-స్లాట్ విధానాన్ని సైతం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తేవాలని యోచిస్తోంది. దీని ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, సేవల్లో వేగం పెరుగుతుందని రెవెన్యూ శాఖ భావిస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను బలోపేతం చేయడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ముందుగా మౌలిక సౌకర్యాల కల్పనను ప్రారంభించింది. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 38 సొంత, 106 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏటా అద్దె రూపంలోనే రూ.4.32 కోట్లు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా సొంత భవనాలను నిర్మించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యం విధించారు. దాంతో ఇప్పటివరకు 56 కార్యాలయాలకు భూముల కేటాయింపు పూర్తయింది. శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది.



## రాచరికం మళ్లీ రావాలి

**నేపాల్‌లో భారీ నిరసనలు**

**కాఠ్మాండూలో రోడ్లపైకి వందలమంది**

**హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని డిమాండ్**

**కాఠ్మాండూ, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** నేపాల్‌లో మళ్లీ రాచరిక పాలన రావాలని వందలాది మంది కాఠ్మాండూలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటు, ప్రధాన మంత్రి నివాసం ఉన్న హై సెక్యూరిటీ జోన్ సమీపంలో రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీకి చెందిన దాదాపు 1,500 మంది ధర్నా చేశారు. 'గణతంత్ర విధానం నశించాలి', 'రాచరికం మళ్లీ రావాలి', 'నేపాల్‌ను హిందూ దేశంగా ప్రకటించాలి' అంటూ నినాదాలు చేశారు. ఆర్‌పీపీ చైర్మన్ రాజేంద్ర లింగ్డెన్, సీనియర్ నేతలు పశుపతి షంషేర్ రాణా, మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ధ్రుబ బహదూర్ ప్రధాన్ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో కాఠ్మాండూలోని కీలక ప్రాంతాల్లో వేలాది మంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. అనుమతిలేని ప్రదేశాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఆర్‌పీపీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. నేపాల్ ప్రతినిధుల సభలో ఆర్‌పీపీ ఐదో అతి పెద్ద పార్టీ. పోలీసులు అరెస్ట్ చేసిన తమ నేతలను వెంటనే విడుదల చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేసింది. తమ నిరసనలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

## యెమెన్‌పై అమెరికా బాంబుల వర్షం

**సనా, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):** యెమెన్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. అమెరికా యుద్ధ విమానాలు యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై బాంబులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ విమానాలు యెమెన్‌లో దాదాపు 50 లక్ష్యాలను ధ్వంసం చేశాయి. సనా, హొదైద, అమ్రాన్ నగరాలపై బాంబులు జార విడిచినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి ఈ దాడులు చోటుచేసుకున్నాయి. తాజా దాడుల్లో హొదైదలోని పోర్టు, విమానాశ్రయం కూడా ధ్వంసమైనట్లు హూతీలు చెబుతున్నారు. తమ దాడులు ఏమాత్రం ఆగవని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కొన్ని రోజుల క్రితమే అమెరికా ఎర్ర సముద్రంలో నౌకాశ్రయంపై చేసిన దాడుల్లో 70 మంది చనిపోయారు. దాదాపు 171 మంది గాయపడ్డారు. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో ఇదే అత్యంత తీవ్రమైంది. ఈ దాడిపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్పందించారు. ఈ చర్యలు తీవ్ర ఆందోళనకరమన్నారు. కాగా హూతీ రెబల్స్ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడంతో ఈ దాడులు జరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు.

# రాజేంద్రనగర్లో భక్తి శ్రద్ధలతో యేసు క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) పండుగలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్


యేసు క్రీస్తు పునరుత్థాన ఆరాధన లో పాల్గొన్న క్రైస్తవులు


ఉప్పర్ పల్లి హెూరేబు చర్చి లో విశ్వాసులు

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చీలలో ఆదివారం యేసు క్రీస్తు పునరుత్థాన పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు ప్రభువును సిలువ వేయగా ఆయన మూడవ దినమున తిరిగి లేచాడని క్రైస్తవులు పునరుత్థాన పండుగ (ఈస్టర్) వేడుకలను నిర్వహిస్తారు. ఆదివారం చర్చీలలో యేసు పునరుత్థాన పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విజయోత్సవాలు నిర్వహించారు. మరణాన్ని గెలిచి లేచిన యేసయ్యకు జేజేలు పలికారు. యేసు మరణించి తిరిగి లేవడం ద్వారా ఆయనను నమ్ముకున్న విశ్వాసులకు జీవ పునరుత్థానం లభిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను నిర్వహించుకొంటారన్నారు. రాజేంద్రనగర్ మన్నాచర్చిలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ , అత్తాపూర్ రాక్ చర్చిలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె. సుందర్ పాల్, బుద్వేల్ బెథెస్టా మిషన్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ కె.నతానియేల్, క్రీస్తు గుట్టలో సిస్టర్ యేసుమిణి, ఉప్పర్ పల్లి హెూరేబు చర్చిలో రెవరెండ్ పి.స్వర్ణకుమార్, అత్తాపూర్ లో రెవరెండ్ జేపీ పాల్, రెవరెండ్ సామ్యూల్ రాజ్, తేజస్వీనీ కాలనీలోని ట్రినిటీ కాథడ్రల్ చర్చిలో బిషప్ జోసెఫ్ కిషోర్, దుర్గానగర్ ఎలోహిమ్ చర్చిలో



రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్.. రెవరెండ్ పి స్వర్ణకుమార్

రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, నాగమల్లయ్య గౌడ్ వెంచర్ లో రెవరెండ్ పాల్ దేవరాజ్, లక్ష్మీగూడలో రెవరెండ్ జాన్ వెస్లీ , రెవరెండ్ మూర్తి, బాబుల్ రెడ్డి నగర్ లో రెవరెండ్ డి. ఆనంద్ పాల్ , మధుబన్ కాలనీలో రెవరెండ్ విజయ్ కుమార్, శాస్త్రీపురంలో రెవరెండ్ థామస్ కురియన్, బవానీకాలనీలో రెవరెండ్ ఎ.మనోహరం, ఎర్రబోడలో పాస్టర్ మధు, కాటేదాన్ ఆనంద్ నగర్ లో సిస్టర్ లీనా కుమారి, పాస్టర్ దినకర్, సిస్టర్ లిల్లీ గ్రేస్, శివరాంపల్లిలో పాస్టర్ బట్టు శ్రీకాంత్, సిస్టర్ పద్మ ఇశ్రాయేల్, పాస్టర్ ప్రమోద్ కుమార్, అత్తాపూర్ లో పాస్టర్ యేసు రత్నం, బుద్వేల్ లో పాస్టర్ ప్రణీత్ బాబు ఆధ్వర్యంలో యేసు క్రీస్తు పునరుత్థాన పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు

**బుద్వేల్ షీడ్జ్ మెమోరియల్ మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో పునరుత్థాన అరుణోదయ ఆరాదనలు :**

బుద్వేల్ షీడ్జ్ మెమోరియల్ మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం పక్కన యేసు పునరుత్థాన అరుణోదయ ఆరాధనలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు పాస్టర్ రెవరెండ్ అశోక్, పాస్టర్ నతానియేల్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్ సందేశాలను విమలేశ్ కుమారీ అందజేశారు. కార్యక్రమం లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పాల్గొని క్రైస్తవులకు యేసు పునరుత్థాన పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మెథడిస్ట్ చర్చికి చెందిన ప్రకాశ్, రగడంపల్లి శ్రవణ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుగుచెరువు మహేశ్. కోరని బాల్ రాజ్, బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కెఎస్ దయానంద్ లు పాల్గొన్నారు.



## మణికొండతో ప్రజల సమస్యలు.. గుడ్ మార్నింగ్‌తో పరిష్కారం

### మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ సీతారాం ధూళిపాళ

గండిపేట,ఏప్రిల్20(ప్రభాత ఉదయం) గుడ్ మార్నింగ్ మణికొండతో ప్రజల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ సీతారాం ధూళిపాళ అన్నారు.ఆదివారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమాన్ని భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు ల్యాంకో హిల్స్ పరిధిలోని ఏఎస్ బిఎల్ లేక్ సైడ్ టవర్ అపార్ట్మెంట్ కు వెళ్లారు.స్థానిక ప్రజల ముఖ్య సమస్యగా ఇరుకు రహదారిలో ట్రాఫిక్ కు అంతరాయం కలిగే విధంగా సైన్ బోర్డులు పెట్టి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని వాపోయారు.పరిష్కార మార్గంగా ల్యాంకో హిల్స్ నుండి సాయికృప వారు వేసిన లేఔట్ ప్రకారం హై టెన్షన్ వైర్ల క్రింద పద్మనాభ స్వామి ఆలయం వెళ్ళడానికి అనువుగా ఏర్పాటు చేసిన పాత రహదారి మార్గ సూచికలు ఉన్నా ఫెన్సింగ్ వేసి రహదారి మూసివేయడం జరిగిందని,ఆ ఫెన్సింగ్ తొలగించి ప్రజల సౌకర్యార్థం రహదారి కొనసాగించాలని కోరారు.మున్సిపాలిటీ వారు ఒక వైపు,రిజిస్ట్రేషన్ అధికారులు మరొక వైపు ఒక ఫ్లాట్ కు ఆస్తి పన్ను ఇద్దరికి కట్టమని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.రహదారి వీధి దీపాలు లేనందున నిర్మానుష్యంగా ఉన్న స్థలంలో రాత్రి కాగానే కొంత మంది మత్తు పానీయాలు సేవించిన తరువాత పెద్దగా అల్లర్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కావున పోలీసు పెట్రోలింగ్ చేయాలని తెలిపారు.అపార్ట్మెంట్ వెనుక ఉన్న ఖాజాగూడ సరస్సు కొద్దికొద్దిగా కబ్జాకు గురవుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణ,శ్రీధర్ నాయుడు,ప్రశాంత్, శ్రీధర్, జైరామ్,నరేష్, కోటిరెడ్డి,సురేష్ ,శ్రీకాంత్, శివ,రాణా,శ్రీనాథ్ రెడ్డి,సిద్దేశ్వర్, రవీందర్, బాలు,రఘు ఉయ్యాల,రమణరెడ్డి, కృష్ణ,ఆశ, శాంత,విశ్వజిత్,సచిన్ లతో పాటు గుట్టమీది నరేందర్,అందే లక్ష్మణ్ రావు,ఉపేంద్రనాథ్ రెడ్డి,సంగం శ్రీకాంత్,కోడిచెర్ల దేవేందర్, యాలాల కిరణ్,భానుచందర్, జైరామ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ,రమణ మూర్తి,యాలాల బెన్నీ తదితరులు పాల్గొన్నారు.


బుద్వేల్ రజక సంఘం నాయకులు

## బుద్వేల్ రజక సంఘం అధ్యక్షుడుగా పెండ్యాల సత్తయ్య నియామకం

బుద్వేల్ ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): బుద్వేల్ రజక సంఘం అధ్యక్షుడుగా పెండ్యాల సత్తయ్య నియమితులైనరు. ఆదివారం జరిగిన రజక సంఘం ఎన్నికలలో ఆయన ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవీలో ఉంటారు. ఈ సందర్భంగా పెండ్యాల సత్తయ్య మాట్లాడుతూ, రజకుల అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. బస్తీ లో ఏ పండుగ వచ్చిన విజయవంతంగా చేయడానికి ముందుండి పనిచేస్తానన్నారు. తనపై నమ్మకముంచి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు ప్రతి సభ్యునికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పి.సురేందర్, సంఘం నాయకులు ఎం.క్రిష్ణ, డి.వెంకటేశ్, పి.నందం, ఎస్.రవి. షాబాద్ శ్రీనివాస్, పి.సంతోష్, పి.రాజు, పి.మహేందర్, పి.అరవింద్, జి.గోపి క్రిష్ణ, పి.నర్సింగ్ రాజు, పి.దశరథ్. ఎల్. శ్రీధర్, పి.శ్రీనివాస్, పి.వినోద్ కుమార్. -పి.కిరణ్, పి.యాదయ్య, ఎస్.మురళీ, డి. ప్రదీప్ లు పాల్గొన్నారు.


మనోజ్ కుమార్ పరీక్

## ఇంట్లో క్రింద పడి తల పగిలి ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం) : తాను అద్దెకుంటున్న ఇంట్లో క్రింద పడి తల పగులడం తో ఓ వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన జరిగి మూడు రోజులవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు వచ్చి తలుపులు పగులగొట్టి చూసారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... రాజస్థాన్ కు చెందిన మనోజ్ కుమార్ పరీక్(47) కుటుంబ సభ్యులతో కలసి ఆరు నెలలుగా మైలార్దేవుపల్లి దుర్గా కన్వెన్షన్ కు ఎదురుగా వినాయకనగర్ లో రమేశ్ అనే వ్యక్తి ఇం ట్లో అద్దెకు ఉంటున్నాడు. వేసవి సెలవులకు భార్య పిల్లలు స్వాగ్రామానికి వెళ్లగా మనోజ్ ఒక్కడే ఇంట్లో ఉ న్నాడు. మూడు రోజుల క్రితం భార్యతో మాట్లాడినట్లు తెలిసింది. ఆదివారం మనోజ్ నివాసం ఉండే ఇంట్లో నుంచి దుర్వాసన రాగా ఇంటి యజమాని రమేశ్ మైలార్దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి చూడగా తలుపులు పెట్టి ఉన్నాయి. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూసే సరికి మనోజ్ ఫ్లోరింగ్ స్కటింగ్ బండలపై పడటం తో తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్త స్రావం కావడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెం దాడు. అత్తాపూర్ లో నివాసం ఉండే మనోజ్ భావ చంద్రశేఖర్ జోషి పిర్యాదు మేరకు మైలార్దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భగవాన్ పరశురామ్ జయంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న సుదర్శన్ తివారీ తదితరులు

## భగవాన్ పరశురాం జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

బుద్వేల్, ఏప్రిల్20 (ప్రభాత ఉదయం): ఈ నెల 29వ తేదీన భగవాన్ పరశురాం జయంతి వేడుకలను పరశురామ్ భక్త మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సుదర్శన్ తివారీ తెలిపారు. ఆదివారం జయంతి ఉత్సవాలకు సంబందించిన వాల్ పోస్టర్ ను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుదర్శన్ తివారీ మాట్లాడుతూ, రాంబాగ్ కాలా హనుమాన్ దేవాలయం నుంచి శోభా యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. భగవాన్ పరశురాం జయంతి వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భక్త మండల్ సభ్యులు అశోక్ శర్మ, శశికాంత్ శర్మ, శోభ పాండే, పార్వతీ శర్మ, నవనీత్ వ్యాస్, గోవింద ఓజా తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామీ కళ్యాణ మహెూత్సవం


మల్లికార్జున స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు..


స్వామీ వారి కల్యాణం

బుద్వేల్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం) : వేధ పండితులు, ఒగ్గు కళాకారుల మంత్రోచ్చరణల మద్య హైదర్ గూడ శ్రీ మల్లికార్జున స్వామీ కళ్యాణ మహెూత్సవాలు ఆదివారం అంగరంగ వైభవం గా జరిగాయి. గణపతి పూజ, స్వామీ వారికి అభిషేకాలతో శనివారం ప్రారంభమైన పూజలు ఆదివారం ముగిసాయి. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు ఈ పూజా, కళ్యాణ వేడుకలకు హాజరైనారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మద్య గంగ తెప్ప బోనాల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాలలో కురుమ సంఘం పెద్దలు బండారు నారాయణ, ఎగ్గే మల్లేశం, మొండ్ర నర్సింహ్మా, క్యాదం నర్సింగ్రావు, కొంగళ్ల ప్రసాద్, నల్లింగ్ రాజు. మహేందర్, బిట్కూరి శ్రీను. లతో పాటు అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్దేవపల్లి డివిజన్ల కార్పొరేటర్లు మొండ్ర సంగీత గౌరీశంకర్. పి.అర్చన జయప్రకాశ్, తోకల


స్వామీ వారిని దర్శించుకున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

శ్రీనివాస రెడ్డి, వివిధ పార్టీల నాయకులు మొండ్ర కొమురయ్య, ఎన్.మల్లారెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, శేఖర్రెడీ, నల్దింగ్ రమేశ్, షాబాద విజయ్ కుమార్, సులిగె వెంకటేశ్ లు పాల్గొన్నారు. భక్తులకు గౌరెల్లి నాగేశ్ ఆద్వర్యంలో అన్నదానం చేశారు.


ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు

## నవ యువ యువజన సంఘం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ

బుద్వేల్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం) : నవ యువ యువజన సంఘం ఆధ్వర్యంలో యువత కు నెల రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మైలార్దేవుపల్లి డివిజన్ బావన రుషి కాలనీ, శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్టు భవన్లో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ కంప్యూటర్ శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నవ యువ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామీ మాట్లాడుతూ, య వత కు ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణలో తమ సంఘం ముందుండి పనిచేస్తుం దన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాస్, సామల యాదయ్య, కొంకటి ఆంజనేయులు, చిరంజీవి. ఇప్ప రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలలో పాల్గొన్న అభిమానులు

## మైలార్దేవుపల్లిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

బుద్వేల్, ఏప్రిల్20(ప్రభాత ఉదయం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి ప్రధాతగా హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయిలో కి తీసుకువెళ్లిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు దక్కుతుందని చంద్రబాబునాయుడు ఆర్మీ నాయకులు బండారి యాదగిరి, కాశిగారి యాదగిరి, ఎర్వ సత్యనారాయణ, యంజాల మహేశ్, తిరుమల వెంకటేశ్ లు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం మైలార్ దేవుపల్లి డివిజన్ టీఎన్జీవో స్ పార్కులో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. టెక్నాలజీ, మౌళిక సదు పాయాలు, రైతుల సంక్షేమం వంటి రంగాలలో ఆయన సేవలు ఎంతో గొప్పవన్నారు. యువతకు మార్గదర్శిగా నిలిచారన్నారు. తామంత ఒకప్పుడు తెలుగుదేశంలో ఉన్నామని, ఆయన పనితీరు, క్రమశిక్షణ నేటికి మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో కుంకుల దత్తు, శివ, నారాయణ, బాన శ్రీనివాస్, మహిపాల్, సీతారం పాండు, గటయ్య, శేఖర్ గౌడ్, కొండల్, మహేందర్, ప్రభాకర్ గౌడ్, సంతోష్ గౌడ్, మధు, మునుగపాటి వెంకటేశ్, స్వామీ గౌడ్, దేవేందర్, వడిగ చర్ల మల్లేశ్, శరణమ్మ, పుష్ప, గౌతమి లు పాల్గొన్నారు.


**రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి త్వరలో పెద్ద ఎత్తున టీడీపీ లో చేరికలు ?**

రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు త్వరలోనే టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల నిర్వహణ ను బట్టి చూస్తుంటే త్వరలో ఈ ప్రాంతం కు చెందిన బడా నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకుం టారనే ఊహగానాలు వినిపిస్తున్నాయి. వేచి చూద్దాం మరి.

# స్నేహితులకు ఈద్ మిలాప్ దావత్ ఇచ్చిన సయ్యద్ హిదాయతుల్లా షఫీ


1984-85లో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 10వ తరగతి బ్యాచ్..


చిన్ననాటి స్నేహితులు..


దావత్ ఇచ్చిన సయ్యద్ హిదాయతుల్లా షఫీ

## డైరీ ఫామ్ మెహ్రాబ్ హెూటల్‌లో వేడుక


బుద్వేల్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం): స్నేహమేరా జీవితం.... స్నేహమేరా శాశ్వతం.... అంటూ కలిసి సంతోషంగా గడిపారు చిన్ననాటి స్నేహితులు. వారంత రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984 - 85వ విద్యా సంవత్సరంలో కలసి 10వ తరగతి చదివిన మిత్రులు. తమ స్నేహితుడైన సయ్యద్ హిదాయతుల్లా షఫీ రంజాన్ పండుగ అనంతరం ఇచ్చే ఈద్ మిలాప్ దావత్ ఇవ్వడంతో డైరీ ఫార్మ్ సమీపంలోని మెహ్రాబ్ హెూటల్లో ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. అందరూ కలిసి సంతోషించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అందరినీ ఒకే చోట కలిపిన సయ్యద్ హిదాయతుల్లా షఫీ కి అభినందనలు తెలియజేశారు. ప్రతి నెల ఒకసారి ఇలా కలుద్దామంటూ తీర్మానం చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా నరసింహారెడ్డి :**

ఈద్ మిలాప్ దావత్ లో హైదర్ గూడ కు చెందిన నర్సింహారెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అందరిని కడపారా నవ్వించారు. చిన్నపిల్లడిలా మారిపోయి అందరితో కలిసిమెలిసి సంతోషాన్ని పంచుకున్నారు.

**స్నేహితులకు అండగా ఉందామని మాట్లాడిన మిత్రులు :**

ఈద్ మిలాప్ దావత్ లో మాట్లాడిన మిత్రులు వై శ్రీధర్, బి. ఆంజనేయులు, ఎం నాగభూషణం, మంజూర్ అహ్మద్, చిమన్ లాల్, కృష్ణా రెడ్డి లు అందరం ఐకమత్యంగా ఉంటూ ఒకరి కష్ట సుఖాలలో పాలుపంచుకుందామంటూ చెప్పుకున్నారు. కార్యక్రమంలో బి వేణుగోపాల్ , ఎం శ్రీనివాస్ యాదవ్, బి శంకు స్వామి, మల్లేష్ , ఎస్ జనార్దన్ రెడ్డి , పి జనార్దన్ రెడ్డి , రవీందర్, సామ సుమన్ రెడ్డి , ఎ .భీమయ్య , ఎం రాంబాబు యాదవ్, హఫీజ్ , రవీందర్ షిండే, శివ కుమార్, పి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.






# SSMB29 షూటింగ్ అప్‌డేట్

## 3 వేల మందితో భారీ యాక్షన్ సీక్వెన్స్

ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సూపర్ స్టార్ మహేశ్ బాబు కలిసి ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. %యూవీదీ%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ %-% రాజమౌళి కాంబోలో వస్తున్న తొలి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో ప్రియంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒడిషా షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి తాజా అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా.. తదుపరి షెడ్యూల్‌లో భాగంగా నీటిలో ఒక భారీ బోట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు, ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌తో పాటు సుమారు 3 వేల మంది జూనియర్ ఆర్టిస్ట్‌లు పాల్గొననున్నారని తెలుస్తోంది. వీరంతా ఈ సన్నివేశం కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని సమాచారం. ఈ సీక్వెన్స్‌ను మే నుంచి జూన్ వరకు చిత్రీకరించనున్నారు. దీని కోసం హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఈ యాక్షన్ ఘట్టాన్ని షూట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా సాహసయాత్ర చేసే ఒక సాహసికుడి కథగా ఉండనుంది.



### మరో నార్త్ బ్యూటీని సౌత్‌కు పరిచయం చేస్తున్న

# మణిరత్నం

మణిరత్నం పేరుకు కోలీవుడ్ డైరెక్టర్ కానీ.. ప్రాణం అంతా నార్త్‌పైనే. తన స్టోరీలో తమిళ వాసనలతో పాటు ఉత్తరాది టచ్ ఉండేలా చూసుకుంటారు. స్టోరీ, లోకేషన్స్ పరంగానే కాదు అక్కడి భామలకు ఇక్కడ బ్రేక్ ఇస్తుంటారు. బొంబాయితో మనీషా కొయిరాలాకు, ఇరువర్‌తో టబు, దిల్ సేతో ప్రీతి జింటాకు, యువతో ఇషా డియోల్‌కు ఇక్కడ క్రేజ్ వచ్చేలా చేశాడు. ఈ కేటగిరిలో కొంత మంది సౌత్ మూలాలతో పాటు నార్త్ కనెక్షన్స్ ఉన్న ముద్దుగుమ్మలు ఉన్నారు. ఐశ్వర్యరాయ్, మధుబాల, అదితిరావ్ హైదరీ ఇలా వీళ్లను కూడా తన డెన్‌లోకి ఆహ్వానించాడు. ఇప్పుడు వీరి జాబితాలోకి చేరింది శాన్య మల్హోత్రా. దంగల్ మూవీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శాన్య మల్హోత్రాకు బదాయి హెూ, శకుంతల దేవీ, జవాన్, శ్యామ్ బహదూర్ చిత్రాలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కానీ ఆమె పేరు ఓవర్ నైట్ మోత మోగిపోయేలా చేసింది మిసెస్. మలయాళ బొమ్మ ద గ్రేట్ ఇండియన్ కిచెన్ ఇది రీమేక్. ఓటీటీ ఫిల్మ్ అయినప్పటికీ శాన్య ఫెర్మామెన్స్‌కు ఫిదా అయిపోయారు ఉమెన్ ఆడియన్స్. ఈ సినిమా కాస్త నెగిటివిటీని అందుకున్నా మంచి రివ్యూస్ అండ్ రేటింగ్ వచ్చాయి . ఈ ఓటీటీ మూవీతో శాన్య పేరు ఆల్ ఇండస్ట్రీలో గట్టిగానే వినిపించింది. ఈ బాలీవుడ్ బ్యూటీకి సౌత్‌లో లైఫ్ ఇచ్చేందుకు తీసుకు వస్తున్నాడు టాప్ మోస్ట్ డైరెక్టర్ మణిరత్నం. కమల్-శింబుతో కాంబోలో వస్తోన్న థగ్ లైఫ్‌లో వన్ ఆఫ్ ది హీరోయిన్. రీసెంట్లీ ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు. ఇందులో శాన్య అందరిని డామినెట్ చేసింది. త్రిష నామ్‌కే వాస్తేగా మిగిలిపోయింది. శింబుతో స్టెపులేసి మెస్మరైజ్ చేసిన శాన్య.. చెన్నై బ్యూటీకి కాంపిటీషన్ ఇచ్చేట్లే కనిపిస్తోంది. ఇవే కాదు.. బాలీవుడ్‌లో మరో మూడు ప్రాజెక్టులు చేస్తున్న కర్లీ హెయిర్ క్యూటీకి.. మణిరత్నం బ్రేక్ ఇస్తాడో లేదో తెలియాలంటే జూన్ 5 వరకు వెయిట్ చేయాల్సిందే.



### స్టార్ హీరోయిన్‌తో స్పెషల్ సాంగ్

# ప్లాన్ చేస్తున్న బుచ్చిబాబు!

టాలీవుడ్‌లో భారీ బడ్జెట్ సినిమాలు ఎక్కువ సంఖ్యలో విడుదలకు సిద్ధం అవుతున్న..అందులో కొన్ని సినిమాలపై మాత్రమే ఊహించని స్థాయిలో అంచనాలు ఏర్పడుతున్నాయి. అందులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' మూవీ ఒకటి. బుచ్చిబాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు ఉహించని రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ట్విస్టులు సైతం ఒకింత ఆసక్తికరంగా ఉండనున్నాయని తెలుస్తోంది. అయితే ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి వైరల్ అవుతుంది.. ఎంటీ అంటే ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తో ఓ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట దర్శకుడు బుచ్చిబాబు. దీని గురించి ఎలాంటి ప్రకటన రానప్పటికి ఈ వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది. గతంలో కాజల్ అగర్వాల్ జనతా గ్యారేజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేయగా ఆ సాంగ్ ఊహించని స్థాయిలో రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. కాగా ఈ వార్త నిజమైతే, ఈ సారి కూడా కాజల్ హిట్ కొట్టడం ఖాయం. ఇక పోతే ఈ మూవీ 2026 మార్చి 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే అదే సమయానికి నాని 'ది ప్యారడైజ్' సినిమా కూడా ఫిక్స్ అయింది. ఇక ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద పోటీ గట్టిగానే ఉండబోతున్నట్లుగా కనిపిస్తోంది.

### జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే

# అదే ముఖ్యం



జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే ఒత్తిడి లేకుండా ఉండడమే ముఖ్యమని అంటున్నాడు బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్. తన జీవితంలో జరిగి విషాద సంఘటన వలన తనకు డబ్బు, ఫేమ్ కంటే మానసికి ఒత్తిడి లేకుండా ఉండడమే లైఫ్‌లో ఉత్తమమని పంచుకున్నాడు షారుక్. త్వరలో కింగ్ సినిమాతో ప్రేక్షకు ల ముందుకు రాబోతున్న ఆయన తాజాగా ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు. నా తల్లిదండ్రుల మరణం నా సోదరిపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ రోజు నా తండ్రి మృతదేహం ముందు నిలబడి ఆమె ఏ మాత్రం ఏడవలేదు, ఇప్పటికీ ఆ సంఘటన నాకు గుర్తుంది. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఆమె ఆ మానసిక స్థితి నుంచి బయటపడలేకపోయింది. అందుకే నేను ఆమెలా డిప్రెషన్‌లో కూరుకుపోకుండా సినిమాల్లో నిమగ్నమై ఉంటాను. అందుకే జీవితంలో డబ్బు, కీర్తి కంటే ఒత్తిడి లేకుండా జీవించడమే నాకు ముఖ్యం అంటూ షారుక్ చెప్పుకోచ్చాడు.



### డివోర్స్‌కి సిద్ధం అయిన

# స్టార్ కపుల్!

నజ్రియా నజీమ్, ఫహద్ ఫాజిల్.. ఈ కపుల్స్ కి ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో మనకు తెలుసు.. 'రాజా రాణి మూవీతో టాలీవుడ్‌కి పరిచయం అయిన ఈ చిన్నది నేచురల్ స్టార్ నాని సరసన 'అంటే.. సుందరానికీ' చిత్రంలో నటించి మెప్పించింది. రీసెంట్‌గా ఈ బ్యూటీ నటించిన 'సూక్ష్మదర్శిని' అనే చిత్రంతో సెన్సేషన్ క్రియేట్ చేసింది. మలయాళంలో విడుదలైన ఈ మిస్టరీ మూవీ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లోనూ సంచలనంగా మారింది. ఇక ఫహద్ ఫాజిల్ గురించి మాట్లాడుకుంటే.. అల్లు అర్జున్ 'పుష్ప' చిత్రంలో షికావత్ సార్ పాత్రలో ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశారు మనకు తెలిసిందే. ఇలా కెరీర్ పరంగా దూసుకుపోతున్న ఈ జంట తాజాగా విడాకులకి సిద్ధం అయినట్లు వార్తలు వినపడుతున్నాయి. నజ్రీయా రీసెంట్‌గా విడుదల చేసిన నోట్‌లో .. పలు వ్యక్తిగత సమస్యలతో బయటికి రావడం లేదని చెప్పుకొచ్చినప్పటికి.. కనీసం బర్త్ డే కూడా చేసుకోలేకపోయా, పైగా తన స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులకు టచ్‌లో ఉండటంలేదు. త్వరలోనే అందరి ముందుకు వస్తాను. ఆ తర్వాత మీకు అన్ని విషయాలు మీకు తెలుస్తాయి. అని చెప్పడంతో డివోర్స్ రూమర్లు మరింత జోరందుకున్నాయి. అంతేకాదు తాజాగా వీరిద్దరి డివోర్స్‌కు పలు కారణాలున్నాయని టాక్ వినిపిస్తోంది.నజ్రియాకు పలు హీరోలతో ఎఫైర్లు ఉన్నాయని, పైగా ఆమెకు సినిమాలు చేయొద్దని కండీషన్స్ పెట్టడం ఇలా పలు కారణాలు తమిళ, మలయాళ ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి.

### ధనుష్ 'ఇడ్లీ కడై'సెట్‌లో

# భారీ అగ్ని ప్రమాదం

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇడ్లీ కడై' సెట్‌లో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తమిళనాడులోని తేని జిల్లా, అనుప్పపట్టి గ్రామంలో ఈ చిత్రం కోసం నిర్మించిన భారీ సెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సెట్‌లో ఉపయోగించిన చెక్క, రసాయనాలు, ఫ్లెక్సీలు, పెయింట్స్ వంటి వస్తువుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, సెట్ దాదాపు పూర్తిగా దగ్ధమైంది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని సమాచారం. ఈ చిత్రంలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై ధనుష్, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 1, 2025న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమాదం కారణంగా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోగా, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231.** Cell:9391089608